సాక్షి
నంద్యాల
మంగళవారం ; 30 ; సెప్టెంబర్ ; 2025



అలైన్‌మెంట్ ఖరారు

అనంతపురం–అమరావతి హైవే నిర్మాణానికి అలైన్‌మెంట్ దాదాపు ఖరారు అయ్యింది. ఈ రహదారి పూర్తయితే సంతోషకరమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. 8లో▸



ధర మెరిసిపోతోంది!

బంగారం ధర దూసుకుపోతోంది. ప్రజలు అప్పు చేసి మరీ బంగారం కొంటున్నారు. ప్రస్తుతం రోజు వారీ వ్యాపారం రూ.60 కోట్లకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,429
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,327

న్యూస్‌రీల్

సబ్‌జైల్ తనిఖీ చేసిన జడ్జి



ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న జడ్జి

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల సబ్ జైల్‌ను సోమవారం మూడవ అదనపు జిల్లా జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ అమ్మన్నరాజా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలు గదులు, పరిసరాలు, వంటశాలను పరిశీలించారు. అనంతరం ఖైదీల వివరాలు, వారి ఆరోగ్య విషయాల గురించి ఆరా తీశారు. ఆర్థికంగా వెనుకబడిన ఖైదీలకు, 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు. ఖైదీలతో ఒక్కొక్కరితో మాట్లాడి వారి నేర విషయాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన రిమాండు ఖైదీలతో మాట్లాడుతూ.. జైలు శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సూపరింటెండెంట్ గురుప్రసాద్ రెడ్డి లోకాదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు.

కోర్టు చెప్పినా ఇంటికి రస్తా ఇవ్వడం లేదు

- ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల: 'మా ఇంటికి రస్తా ఇవ్వకుండా పక్కన నివాసముంటున్న వారు ఇబ్బంది పెడుతూ, బెదిరిస్తున్నారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించగా రస్తా స్థలం మాదేనని తీర్పు ఇచ్చింది. అయినా ఇబ్బంది పెడుతున్నారు. విచారించి న్యాయం చేయండి' అంటూ చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య జిల్లా ఎస్పీ సునీల్‌షెరాన్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట పరిధిలో ఉన్న ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో ఆయా సమస్యలపై 76 వినతులు వచ్చాయని, వాటిని ఆయా స్టేషన్ల వారీగా ఎండార్స్ చేశామని ఎస్పీ తెలిపారు.

శనగ విత్తనాలకు అడ్డగోలు ధర

- కిలో ధర రూ.78.. సబ్సిడీ 25 శాతమే

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో కిలో శనగల ధర గరిష్టంగా రూ.55 వరకు మాత్రమే ఉంది. ప్రభుత్వం రబీ సీజన్ కోసం సబ్సిడీపై పంపిణీ చేసే పప్పు శనగలకు మార్కెట్ ధర కంటే తక్కువ ఉండాలి. అప్పుడే రైతులు సబ్సిడీ విత్తనాలపై ఆసక్తి చూపే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధిక ధర నిర్ణయించి సబ్సిడీ మాత్రం 25 శాతానికే పరిమితం చేయడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసే శనగ విత్తనాలు కిలో ధరను రూ.78గా నిర్ణయించింది. కిలోకు 25 శాతం సబ్సిడీ (రూ.19.50) ఉంటుంది. సబ్సిడీ పోగా రైతులు కిలోకు రూ.58.50 చెల్లించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఇంతకంటే తక్కువ ధరకు లభిస్తుండటంతో సబ్సిడీ విత్తనాలకు డిమాండ్ ఉంటుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు 33 నుంచి 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేసింది. అక్టోబర్ 3 నుంచి శనగ విత్తనాలు పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

వైద్య సేవలు సమ్మెసిల్లి!

- పీహెచ్‌సీ వైద్యుల స్టెత్ డౌన్
- సమస్యల పరిష్కారానికి విధుల బహిష్కరించిన వైద్యులు
- వైద్యం అందక అవస్థలు పడిన రోగులు
- అక్కడక్కడా కింది స్థాయి సిబ్బందితో అరకొర సేవలు



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు



చాపిరేవుల పీహెచ్‌సీ వద్ద వైద్యం కోసం వేచి ఉన్న జనం

గోస్పాడు: ఓ వైపు ముసురు పట్టి రోగాలు ప్రబలుతున్నాయి. మరో వైపు గ్రామీణ వైద్యుల సమ్మెబాట పట్టారు. ఈ పరిస్థితుల్లో పల్లె ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మరాయి. జిల్లాలో 59 పీహెచ్‌సీల వైద్యులు సోమవారం ఆసుపత్రికి వచ్చినా కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలకు దూరంగా ఉన్నారు. విధులు బహిష్కరిస్తూ అత్యవసర సేవలు మాత్రమే అందించారు. డాక్టర్లు విధుల్లో ఉన్నా కింది స్థాయి సిబ్బంది సేవలు అందించి మమ అనిపించారు. డాక్టర్లు నాడి పట్టకపోవడంతో రోగులు నిరాశతో వెనుదిరిగారు. గత నాలుగు రోజులుగా వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం చలించకపోవడంతో వారు స్టెత్ డౌన్ చేశారు. దీంతో తమ ఆరోగ్య సమస్యలను చెప్పుకునేందుకు ఆసుపత్రికి వస్తే వైద్యులు పట్టించుకోక పోవడంతో రోగులు నిట్టూర్చారు. అక్కడ ఉన్న సిబ్బంది ఇచ్చిన మందులు తీసుకొని ఇంటి బాట పట్టారు.

ఊరూరా రోగుల అవస్థలు..

➤ నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల, గోస్పాడు మండలాల్లోని పీహెచ్‌సీ వైద్యులు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు చేయకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నంద్యాల మండలం చాపిరేవుల పీహెచ్‌సీలో గడివేముల మండలం నుంచి డిప్యుటేషన్‌గా వచ్చిన డాక్టర్ జబీన్ అత్యవసర కేసులకు వైద్య సేవలు అందించారు. సోమవారం 40 ఓపీలు రాగా వైద్య సిబ్బంది మాత్రలు ఇచ్చి పంపారు. గోస్పాడు పీహెచ్‌సీలో ప్రతి రోజూ 100 మందికి పైగా ఓపీకి వస్తుండగా సోమవారం 80 మంది దాకా వచ్చారు. కానీ వారికి అక్కడున్న స్టాఫ్‌నర్సులు వైద్య సేవలు అందించారు. అరకొరగా మందులు ఇచ్చారని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

➤ ప్యాపిలి మండలం జలదుర్గం పీహెచ్‌సీలో అత్యవసరంగా రోగికి ఛాతినొప్పి రావడంతో డాక్టర్ వైద్య సేవలు అందించారు. మిగిలిన రోగులందరికీ కింది స్థాయి సిబ్బందే వైద్య సేవలు అందించారు.

➤ కొత్తపల్లి మండలం ఎర్రమటం ట్రైబల్ పీహెచ్‌సీలో కూడా డాక్టర్లు అత్యవసర సేవలు మాత్రమే అందించారు. మిగిలిన సేవలు అందక రోగులు ఇక్కట్లకు గురయ్యారు. శ్వాసకోశ సంబంధిత జబ్బుతో ఆసుపత్రికి రావడంతో అత్యవసర సేవలు అందించాల్సి ఉండటంతో వైద్యులు కలుగజేసుకొని రోగికి వైద్య సేవలు చేశారు.

➤ శిరివెళ్ల పీహెచ్‌సీకి వచ్చిన రోగులు వైద్యులు సేవలు అందించడం లేదని తెలుసుకుని ఇంటి ముఖం పట్టారు. ఒక సామాజిక కార్యకర్త ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రావడంతో వైద్యులు అత్యవసర సేవగా గుర్తించి మహిళకు వైద్య చికిత్స అందించి అనంతరం నంద్యాలకు రెఫర్ చేశారు.

➤ మహానంది మండలం తిమ్మాపురం పీహెచ్‌సీలో వైద్యుల సమ్మెతో కింది స్థాయి సిబ్బంది రోగుల సమస్యలు తెలుసుకుంటూ మాత్రలు ఇచ్చారు. నల్లమల అటవీ ప్రాంతం కావడంతో ఇటీవల ప్రజలు అధికంగా విషజ్వరాల బారిన పడ్డారు. అయితే ఆసుపత్రులకు వచ్చిన జ్వర బాధితులు వైద్యుల సమ్మెతో కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లారు. వైద్యుల సమ్మెతో రోగులకు శాపంగా మారింది.

కడుపునొప్పితో బాధపడుతూ వచ్చా



ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని వైద్యం కోసం వచ్చాను. కడుపునొప్పితో బాధపడుతూ వచ్చి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆసుపత్రిలో వైద్యులు నిరసన ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపి వారు అందించాల్సిన వైద్యం ఇక్కడ ఉన్న కిందిస్థాయి సిబ్బందే అందించారు. వైద్యంపై వారికి ఎంత మాత్రం అవగాహన ఉందో తెలియడం లేదు. వారు జనాలకు ఏవో మాత్రలు ఇచ్చి పంపుతున్నారు.

– వెంకటేశ్వర్లు, పసురపాడు

కిందిస్థాయి సిబ్బంది వైద్యం చేశారు



జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చాను. అయితే అక్కడ ఉన్న స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు వైద్యం చేసి మందులు ఇస్తున్నారు. ఇదేమిటని అడిగితే వైద్యులు సమ్మెలో ఉన్నారని చెబుతున్నారు. వైద్యులు అందుబాటులో లేక అనారోగ్యాలతో వచ్చిన మాలాంటి వారు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వైద్యుల సమస్యలు పరిష్కరించి మా లాంటి పేద రోగులకు సరైన వైద్య సేవలు అందేలా చూడాలి.

– ప్రసాద్, కొత్తపల్లి

సేవల అంతరాయానికి ప్రభుత్వానిదే బాధ్యత



ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల న్యాయపరమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలి. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాం. వైద్య సేవల్లో అంతరాయం కలగడంపై పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. 30న జిల్లా ప్రధాన కార్యాలయాల్లో జిల్లా స్థాయి వైద్యుల నిరసన, 1న జిల్లా ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన, నిరసన ర్యాలీ, 2న చలో విజయవాడకు పిలుపునిచ్చాం.

– డాక్టర్ అంకిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యుల శాశ్వత సంఘం జిల్లా అధ్యక్షుడు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లాలో గత ఏడాది జూన్ 15 నుంచి ఇప్పటి వరకు మొత్తం 43,143 అర్జీలు స్వీకరించబడ్డాయని, అందులో సరైన రీతిలో ఎండార్స్ చేయకపోవడం వల్ల 471 దరఖాస్తులు రీ–ఓపెన్ అయ్యాయని తెలిపారు. ప్రతి అధికారి రీ–ఓపెన్ అయిన దరఖాస్తులపై పూర్తి దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులు 1,926 ఉన్నాయని, అందులో రెవెన్యూ 1,038, సర్వే 394, పోలీస్ 130 తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఆడిట్‌లో లోపాలు గుర్తించిన ఫిర్యాదులను తప్పనిసరిగా రీ–ఓపెన్ చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ సేకరణలో డోన్ రూరల్, గడివేముల, గోస్పాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు, సంజామల, రుద్రవరం, పాములపాడు, వెలుగోడు తదితర 15 మండలాలు గత రెండు వారాలుగా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. సోమవారం మొత్తం 263 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసింది!



అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చూపుతున్న రైతులు

- అధిక వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలి
- కర్నూలు మార్కెట్‌లో కమీషన్ల దందాను అరికట్టాలి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నడివాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించేందుకు ఎద్దుల బండిపై వెళ్తున్న కాటసాని

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. హుసేనాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, పొగాకు పంటలను సోమవారం ఆయన రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా చేదు శ్రీనివాసులు, గాలెన్న అను రైతులు సాగు చేసిన పత్తి పొలాల్లో నిల్వవున్న వర్షపునీటితో పంట దెబ్బతిన్న పరిస్థితులను గమనించారు. అనంతరం నడివాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎద్దులబండిపై వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతుల సమక్షంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయన్నారు. పంటలు కోతదశకు వచ్చే సమయంలో అధిక వర్షాలు కురవడం, పండించిన దిగుబడులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా వుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లి దిగుబడులను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకెళ్లిన రైతుల నుంచి కమీషన్ల ముసుగులో దోచుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. అక్రమ వసూళ్లను అరికట్టాల్సిన బాధ్యత మార్కెట్ శాఖ అధికారులపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉల్లి ధరలు తగ్గినప్పుడు రైతులకు నష్ట పరిహారం ఇవ్వడం, ధరలు పెరిగినప్పుడు సామాన్యులు ఇబ్బందులు పడకుండా సబ్సిడీతో ఉల్లిని అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించపోగా, హెక్టారుకు రూ.50 వేలు పరిహారం చెల్లిస్తామని చెప్పినా ఇంత వరకు ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదన్నారు.

రైతుల కష్టాలు కనపడవా..

టీడీపీ నాయకులు పొద్దస్తమానం జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే తప్ప రైతుల బాగోగులను పట్టించుకున్న పాపానపోలేదని కాటసాని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే, కూటమి ప్రభుత్వంలోనే రైతుల పరిస్థితి బాగుందని ఎవరైనా చెబితే తాము కూడా ఏకీభవిస్తామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో బహిరంగ మార్కెట్‌లో రసాయన ఎరువులు కొరత లేకుండా చూసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రజలు గత ప్రభుత్వంలో రైతులకు జరిగిన మేలును, ఈ ప్రభుత్వంలో జరుగుతున్న ఇబ్బందులను గమనించాలని కోరారు. హుసేనాపురం, ఎస్. కొంతలపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నడివాగుపై వాటర్‌షెడ్‌ను అధికారుల అనాలోచితంగా నిర్మించారని, ఆ చెక్‌డ్యామ్ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, వాగుపై వంతెన నిర్మించాలన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాటసాని వెంట ఎంపీపీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీకే వెంగన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు గోపా రమణారెడ్డి, శకునాల పుల్లారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న, కొమ్ము లక్ష్మన్న, కొమరోలు నాగశేషులు, లొద్దిపల్లె ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలపాటి రామకృష్ణ, బుడ్డీష్, కాల్వ సర్పంచు వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతలకు ఉద్యోగులు తలొగ్గొద్దు

- పేదలకు అన్యాయం చేస్తే వదిలే ప్రసక్తే లేదు
- కార్యకర్తలకు అండగా నిలిచేందుకు 'డిజిటల్ బుక్'
- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, పీపీ నాగిరెడ్డి తదితర నాయకులు

బొమ్మలసత్రం: అధికారపార్టీ నేతల మాటలు విని కొందరు అధికారులు, ఉద్యోగులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ధన, మాన, ప్రాణాలకు హాని కలిగించేలా వ్యవహరిస్తున్నారని, నేతలకు అధికారులు తలవంచాల్సిన అవసరం లేదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో కార్యకర్తల కోసం పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న వైఎస్సార్‌సీపీ డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను మాజీ ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పార్టీ నేతలు ఆవిష్కరించారు. అధికారపార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కొందరు అధికారులను తొత్తులుగా మార్చుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మారుమూల ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా డిజిటల్‌బుక్ ద్వారా అండగా నిలుస్తామన్నారు. కార్యకర్తకు అన్యాయం చేసిన అధికారి పేరు, అధికార పార్టీ నాయకుడి పేరు తదితర అంశాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి బలైన వారిని భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదుకుంటామన్నారు. అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరించి తమ కార్యకర్తల కుటుంబాలకు అన్యాయం చేస్తే ఎక్కడ ఉన్నా నడిరోడ్డుపై నిలబెట్టి ప్రశ్నిస్తామన్నారు.

కార్యకర్తలకు వైఎస్ జగన్ అండ ..



రాష్ట్రంలోని పేదలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా వైఎస్ జగన్ చూస్తూ ఊరుకోరని, వారి కుటుంబాలకు ఆదుకుని తీరుతారన్నారు. అధికార పార్టీ నేతలు, అధికారులు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే డిజిటల్ బుక్‌లో వారి వివరాలను నమోదు చేయాలని కోరారు. భవిష్యత్తులో తమ పార్టీ అధికారం చేపడితే ఇబ్బందులకు గురిచేసిన వారి భరతం పట్టడం ఖాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం మ్యానిఫెస్టోలో చెప్పిన పథకాలన్నీ మాట మీద నిలబడి ఎలా నెరవేర్చారో, అలాగే డిజిటల్‌బుక్ ద్వారా తప్పకుండా కార్యకర్తలకు న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు. కార్యకర్తలు తప్పకుండా డిజిటల్‌బుక్‌ను సద్వినియోగం చేసుకుని తీరాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ ఉమెన్‌వింగ్ ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు బసవేశ్వర రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు రసూల్ ఆజాద్, దేవనగర్‌బాషా, అనీల్ అమృతరాజ్, టైలర్ శివయ్య, రామచంద్రుడు, నాయకులు నెరవాటి సత్యనారాయణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న రూపిణి.. మహాగౌరి

- మహాగౌరి స్వరూపంలో శ్రీశైల భ్రామరీ
- నందివాహనంపై దేవదేవుళ్లు



ప్రత్యేక అలంకీకృతులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: మహాగౌరి.. పార్వతీదేవి అవతారంలో శివుణ్ణి భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయడంతో ఆమె శరీరం పూర్తిగా నల్లబడింది. ఆ తపస్సుకు సంతోషించిన పరమేశ్వరుడు ప్రసన్నుడై ఆమె శరీరంపై గంగాజలం చల్లాడు. దీంతో ఆమె తెల్లని వర్ణాన్ని (గౌర వర్ణం)పొందింది. ఈ దేవి నాలుగు చేతులలో అభయ, వరముద్రలతో పాటు త్రిశూలం, ఢమరుకాలను ధరించి ఉంటుంది. దవళ కాంతితో మెరిసే వృషభాన్ని అధిరోహించి భక్త జనకోటికి అభయం ప్రదానం చేస్తూ శ్రీశైల భ్రామరీ మహాగౌరిగా దర్శనమిచ్చారు. శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. ప్రత్యేక అలంకీకృత అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేశారు. అర్చకులు, వేదపండితులు విశేష పూజాహారతులిచ్చారు. నవదుర్గలలో మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతుంది. ఈ దేవిని పూజించడం వలన సకల పాపాలు నశించి, కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. మహోత్సవాల్లో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు నంది వాహనసేవ నిర్వహించారు. అనంతరం మహాగౌరి దేవికి, నందీవాహనాధీశులైన దేవదేవుళ్లకు ఆలయ ఉత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాల్లో తొమ్మిదవ రోజు మంగళవారం ఉదయం భ్రమరాంబాదేవి సిద్ధిదాయిని అలంకారంలో, స్వామిఅమ్మవార్లు కైలాస వాహనసేవలో దర్శనమిస్తారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సైనికుడి మృతి


పీ రఘురామిరెడ్డి

కర్నూలు(అర్బన్): విశాఖపట్నం ఇండియన్ నేవీలో విధులు నిర్వహిస్తున్న నగరంలోని క్రిష్ణానగర్‌కు చెందిన పీ రఘురామిరెడ్డి ఈ నెల 28వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని కర్నూలులోని ఆయన నివాసానికి తీసుకువస్తున్నట్లు నేవీ ఉన్నతాధికారుల నుంచి ఇక్కడికి సమాచారం అందిందన్నారు. ఈ నెల 30వ తేదీన ఆయన అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైనిక్‌బోర్డు, నేవీ అధికారులు, మాజీ సైనికులు పాల్గొంటారని తెలిపారు. ఆయన మృతికి మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నదని, ఆయన కుటుంబానికి సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

తోటలో రైతు మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తోళ్లమడుగు గ్రామానికి చెందిన రైతు సద్దల చలమయ్య(60) మృతి చెందాడు. గ్రామానికి సమీపంలో చీని, నిమ్మ తోటలతో పాటు వరి సాగు చేస్తున్నాడు. సోమవారం కుటుంబ సభ్యులతో పాటు కూలీల తో పనుల్లో నిమగ్నమయ్యాడు. డ్రిప్‌కు సంబంధించి అన్ని వాల్వ్‌లు ఆఫ్ చేసి ఉంచడంతో మర్చిపోయి గేట్‌వాల్వ్ ఆన్‌చేశాడు. నీళ్ల ఒత్తిడికి పైపు ఎగిరి తలకు తగలడంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత కూలీలు గమనించి చలమయ్య కుటుంబ సభ్యులకు తెలిపారు. చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంజినీరింగ్ అధికారులకు సెలవులు రద్దు

కర్నూలు (టౌన్): దేశ ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెల 16వ తేదీ కర్నూలు నగరంలో పర్యటిస్తున్నందున నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల ఉద్యోగులకు సెలవులను రద్దు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వచ్చే నెల 7 వ తేదీ లోపు పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధిచిన వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మాస్ మీడియా అధికారిగా ప్రకాష్‌రాజు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డిస్ట్రిక్ట్ మాస్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్ (డెమో)గా ఎన్.ప్రకాష్‌రాజు నియమితులయ్యారు. గుంటూరులోని పీఓడీటీటీలో పనిచేస్తున్న ఆయన్ను పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డెమోగా ఉన్న పి.శ్రీనివాసులుశెట్టిని కర్నూలులోని రీజనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)లో కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఆయనతో పాటు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్) సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.నిర్మలమ్మను తిరుపతిలోని ఎస్వీఎంసీలో ఉన్న ప్రసూతి హాస్పిటల్‌కు బదిలీ చేశారు.

ధర మెరిసిపోతోంది!

బంగారం ధగధగలు
- ఏడాదిలోనే 10 గ్రాములపై రూ.37 వేలు పెరుగుదల
- వేచి చూస్తే మరింత పెరుగుతుందనే భయం
- ఈ ధరకు 3 శాతం జీఎస్టీ, తరుగు అదనం
- అక్కడక్కడ బంగారం అమ్మకాల్లో అక్రమాలు
- తక్కువ క్యారెట్ల బంగారానికి 22 క్యారెట్ల ధర
- ఇప్పటికీ తెల్ల కాగితాలపైనే రాసిస్తూ మోసం







కర్నూలు(అగ్రికల్చర్): బంగారం ధర దూసుకుపోతోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలను బంగారం ధరలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా ఆలస్యం చేస్తే ధరలు ఇంకెంత పైకి పోతాయోనన్న భయంతో అప్పు చేసి మరీ బంగారం కొంటున్నారు. బంగారం అంటే అతివలకు అమితమైన మక్కువ. నేడు ఎంత బంగారం ఉంటే అంత స్టేటస్ పెరుగుతుందనే అభిప్రాయం ఉంది. అగ్రరాజ్యమైన అమెరికా చర్యల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొనడంతో ప్రపంచ పెట్టుబడిదారులకు బంగారం ఆకర్షిస్తోంది. ఈ కారణంగా రోజురోజుకు డిమాండ్ పెరుగుతుండటంతో ధర పరుగులు పెడుతోంది. ఐదారేళ్లగా ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ జ్యువెలరీ దుకాణాలు పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం బంగారం దుకాణాలు వెలుస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1,500 వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లి తదితర ప్రాంతాల్లో బంగారం దుకాణాలు భారీగా వెలిశాయి. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం రోజు వారీ బంగారం వ్యాపారం రూ.60కోట్లకుపైగానే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక్క కర్నూలు నగరంలోనే రోజు వారీగా రూ.10 కోట్లపైబడి బంగారం వ్యాపారం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఏడాదిలో రూ. 37 వేలు పెరుగుదల

2024 సెప్టెంబర్ 29న 10 గ్రాముల ఆర్నమెంటు (22 క్యారెట్స్) బంగారం ధర 70,500. ఈ ఏడాది ఏప్రిల్ నెల 30వ తేదీ అక్షయ తృతీయ రోజున 10 గ్రాముల ధర రూ.89,800లకు చేరుకుంది. నేడు 10 గ్రాముల ధర రూ.1,07,500 పలుకుతోంది. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే 10 గ్రాములపై రూ.37 వేలు, అక్షయ తృతీయ నాటితో పోల్చితే రూ.17,700 పెరగడం విశేషం. ఐదు దశాబ్దాల చరిత్రలో బంగారం ధరలు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి.

తక్కువ క్యారెట్ల బంగారానికి 22 క్యారెట్ల ధర వసూలు
- కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలతో సహా అన్ని ప్రాంతాల్లోని వ్యాపారులు 14, 16, 18, 20 క్యారెట్ల బంగారం ఆభరణాలు అమ్ముతూ వాటికి 22 క్యారెట్ల ధర వసూలు చేస్తుండటం గమనార్హం.
- ప్రస్తుతం 10 గ్రాముల ఆర్నమెంటు బంగారం ధర రూ.1,06,700 ఉంది. ఒక క్యారెట్ విలువ రూ.4,850 అవుతుంది.
- 22 క్యారెట్లు(916 స్వచ్ఛత) ఉన్న బంగారమైతే ఈ ధర చెల్లించాల్సి ఉంది.
- అయితే దాదాపు అన్ని ప్రాంతాలలో 16,18, 20 క్యారెట్ల బంగారం విక్రయిస్తూ 22 క్యారెట్ల ధర వసూలు చేస్తుండటం గమనార్హం.
- బేరం ఆడటం వల్ల కాస్త ధర తగ్గించినందుకు సంతోషిస్తున్న వినియోగదారులు తక్కువ క్యారెట్ల బంగారం కొనుగోలు చేసి నష్టపోతున్నారు.
- ఇలాంటి వ్యాపారులు వినియోగదారులకు జీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదు. తెల్ల కాగితాలపై రాసిచ్చి మోసపుచ్చుతున్నారు.

3 శాతం జీఎస్టీ, తరుగు అదనం

10 గ్రాముల ధర ప్రస్తుతం రూ.1,05,500 ఉంది. ఈ ధరకు జీఎస్టీ, తరుగు అదనం. బంగారంపై జీఎస్టీ 3 శాతం ఉంది. బంగారం నగల డిజైన్‌ను బట్టి తరుగు 4.50 శాతం నుంచి 22 శాతం వరకు ఉంటుంది. 10 గ్రాముల బంగారంపై జీఎస్టీ రూ.3,225 పడుతుంది. మనం కొనే డైజైన్‌కు సగటున 15 శాతం వరకు తరుగు ఉంటుంది. అంటే జీఎస్టీ, తరుగు కలిపి రూ.19,350 అదనం అవుతుంది. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.1,26,850 అవుతుంది. దీనికి మేకింగ్ చార్జీలు తోడవుతాయి. ఈ ధరతో బంగారం కొనడమంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాల గుండె బరువెక్కుతోంది. ధరల పెరుగుదల చూసి వెనుకడుగు వేస్తున్న వినియోగదారులను ఆకట్టుకునేందుకు కార్పొరేట్ జ్యువెలరీ వ్యాపార నిర్వాహకులు 18 క్యారెట్ల బంగారం నగలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

స్వచ్ఛమైన బంగారానికి హాల్ మార్క్

స్వచ్ఛమైన బంగారానికి సాధారణంగా హాల్ మార్క్ ఉంటుంది. బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ (బిఐఎస్) హాల్ మార్క్ ఇస్తుంది. అయితే కార్పొరేట్ సంస్థలు హాల్ మార్క్ సెటప్ చేసుకున్నట్లుగా ప్రకటించుకుని నాణ్యతకు సొంత మార్కు ఇచ్చుకుంటున్నాయి. బంగారం కొన్నప్పుడు తగిన బిల్లులను విధిగా పొందాలి. బంగారం పోగొట్టుకున్నా.. దొంగలు ఎత్తుకెళ్లినా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బిల్లులు తప్పనిసరి.

“ ధరలు ఇంకా పెరుగుతాయనే భయం



ధరలు పెరుగుతున్నా అవసరాన్ని బట్టి కొనక తప్పడం లేదు. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.1,07,500 ఉంది. ఈ ధర రూ.లక్ష లోపునకు వస్తే వినియోగదారులకు కాస్త ఉపశమనం కలుగుతుంది. ధరలు ఇంకా పెరిగిపోయే ప్రమాదం ఉన్నందున కాస్త ముందుగానే కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో వచ్చాం. – స్వాతి, కర్నూలు

వేచి చూస్తే ధరల భారం



ఏడాదిలో 10 గ్రాముల బంగారంపై దాదాపు రూ.40 వేల పెరుగుదల ఉంది. ధరలు ఇంకా పెరగడమే తప్ప తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. వేచి చూడటం వల్ల ధరల భారాన్ని భరించడమే అవుతుంది. డిజైన్‌లు ఆకట్టుకుంటున్నా ధరలు, తరుగు ఆందోళన కలిగిస్తున్నాయి.– రూప, కర్నూలు

సుంకేసులకు 55,114 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: సుంకేసుల జలాశయానికి సోమవారం ఉదయం 8 గంటలకు 55,114 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాలువకు 2,012 క్యూసెక్కులు వదులుతున్నారు. మిగిలిన నీరంతా క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. హంద్రీనదిలో పాలహంద్రీ, వక్కెర వాగుల ద్వారా వస్తున్న నీరు 5,745 క్యూసెక్కులు జొహరాపురం దగ్గర తుంగభద్ర నదిలో కలుస్తోంది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర, వేదావతి నదులకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సమస్యలు తలెత్తితే నేరుగా కలవండి

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: పదవీ విరమణ అనంతరం రావాల్సిన బెనిఫిట్స్ విషయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా తనను కలవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో పనిచేసి ఆర్మ్‌డ్ రిజర్వుడు విభాగం డీఎస్పీ భాస్కర్ రావు, వెల్దుర్తి పీఎస్ ఏఎస్‌ఐ శివరామిరెడ్డి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారికి శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందిజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో సుఖంగా గడపాలని సూచించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, శివశంకర్, గుణశేఖర్ బాబు, వేణుగోపాల్, ఆర్‌ఐలు జావేద్, నారాయణ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో సచివాలయ ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బొమ్మలసత్రం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ తీర్మాలంటూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కలెక్టర్ కార్యాలయంలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం నంద్యాల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేల నుంచి తమకు విముక్తి చేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు. రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు.

మహానందిలో మహాగౌరి దుర్గగా



మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారిని మహాగౌరిదుర్గగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని విశేష పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా వాహనసేవను రద్దు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, ఎం.నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి సేవలో..


చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబీకులను ఆశీర్వదిస్తున్న పండితులు

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని దేవదాయ శాఖ జోన్–2 రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు చంద్రశేఖర్ ఆజాద్‌ను సత్కరించి ప్రసాదం అందజేశారు.

అమ్మకం లేదు.. అంతా జీఎస్టీ ఆమ్యామ్యా!

- అకౌంటెంట్ ముసుగులో చీటింగ్
- వ్యాపారం చేయకుండానే జీఎస్టీ ట్యాక్స్ స్వాహా
- దొంగ బిల్లులు సమర్పించిన వైనం
- విచారణ చేస్తామన్న అధికారులు


ఇక్కడ విశాలమైన విశాల ట్రేడర్స్ ఉందని చూపుతున్న సందు

మంత్రాలయం: దుకాణం లేదు.. వ్యాపారం ఊసే లేదు.. అయినా ట్రేడర్స్‌ను సృష్టించి జీఎస్టీ నంబర్ పొందాడు. రూ.కోట్లలో వ్యాపారాలు చేసినట్లు దొంగ బిల్లులతో ఏకంగా ప్రభుత్వ ఖజానాకే కన్నం వేశాడు. అకౌంటెంట్ ముసుగులో ఒక వ్యక్తి మూడేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా చేసిన మోసం ఇదీ. రాయచూరుకు చెందిన ఓ డీలర్‌కు అనుమానం వచ్చి జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ చీటింగ్ వెలుగులోకి వచ్చింది.

ఇలా మోసం..

మంత్రాలయానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య విశాల పేరున ట్రేడర్స్‌ను సృష్టించాడు. పాతూరులోని ఇరుకు సందులో ఇంటి చిరునామాలో దుకాణం ఉందని రికార్డులో చూపాడు. అందులో ఐరన్, సిమెంట్, పెయింట్స్ వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. విశాల ట్రేడర్స్ రిజిస్ట్రేషన్‌తో 2002 ఆగస్టు నెల 4వ తేదీన జీఎస్టీ నంబర్ పొంది 2–112 నంబరు ఇంటిని దుకాణంగా చూపించాడు. నాన్ మూవింగ్ ఆఫ్ గూడ్స్ తరహాలో ప్రభుత్వ ట్యాక్స్ మొత్తాన్ని తన సొంత అకౌంట్‌కు మళ్లించుకున్నాడు. కొంత మంది డీలర్లను నమ్మబలికి తానే బిల్స్ వేస్తానని తంతు సాగించాడు. నాన్ మూవింగ్ ఆఫ్ గూడ్స్ విధానంతో మూడేళ్లలో రూ.4 కోట్ల మేర టర్నోవర్ జరిగినట్లు సమాచారం. ఇన్వాస్ బిల్లులు పేరుతో జీఎస్టీ ట్యాక్స్‌ను తన సొంత అకౌంట్‌కు మళ్లించుని దాదాపు రూ.70 లక్షల మేర ప్రభుత్వ జీఎస్టీ ఖజానాకు గండికొట్టినట్లు తెలుస్తోంది.

గుట్టు రట్టు ఇలా..

ఈ చీటింగ్ వ్యవహారాన్ని రాయచూరులోని ఓ డీలర్ తెలుసుకుని జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు ట్రేడర్స్, జీఎస్టీ నంబర్‌పై విజయవాడ, తిరుపతి, కర్నూలు, ఆదోని జీఎస్టీ కార్యాలయాలకు ఫిర్యాదులు అందజేసి పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. నాన్ మూవింగ్ ఆఫ్ గూడ్స్‌పై వే బిల్లు, ఇన్వాస్ బిల్లులు, అలాగే దుకాణాన్ని తనిఖీ చేయాలని విన్నవించారు. రాయచూరు మరో దొంగ ఫర్మ్ క్రియేట్ చేసుకుని తతంగం మొదలు పెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం తెలిసి చీటింగ్ చేసిన వ్యక్తి తన గుట్టును కప్పి పుచ్చుకునేందుకు జీఎస్టీ అకౌంట్‌ను క్లోజ్ చేయాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

విచారణ చేపడతాం

ఫిర్యాదు వచ్చిన మాట వాస్తమే. ఫిర్యాదును ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. హెడ్ ఆఫీసు నుంచి ఆదేశాలు రాగానే పూర్తి విచారణ చేపడతాం. – కల్లూరు వరలక్ష్మి, సీటీవో, ఆదోని

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చెల్లించి, బేయర్, న్యూజివీడు, జీల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, రామచంద్రుడు అన్నారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయించిన షాపు యజమానుల లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కోతలు ప్రారంభమైనందున జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు అమలు చేయాలని కోరారు. శాస్త్రవేత్తల రిపోర్టు అనంతరం కంపెనీలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు సుమారు 40 ఏళ్ల వయస్సు, ఐదున్నర అడుగుల ఎత్తు కలిగిన వ్యక్తి, ఆదివారం రాత్రి పెట్రోల్‌బంకు సర్కిల్ నంద్యాల బస్సు స్టాప్ షెల్టర్ సమీపంలో ఉన్న స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని కాపాడేందుకు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి శరీరంపై సిమెంట్ కలర్, హాఫ్ టీ షర్ట్, లైట్ బ్లూ కలర్ ఫుల్‌షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించినట్లు సీఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశామని, మృతుడి వివరాలు తెలిసిన వారు 91211 01124కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

నాటుసారా కట్టడికి ప్రత్యేక బృందాలు

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు, ఉత్సవాల రోజు మద్యం అమ్మకాలను అరికట్టేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి తెలిపారు. దేవరగట్టు కొండల్లో సోమవారం ఆలూరు సీఐ లలిదాదేవి ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బన్ని ఉత్సవాల్లో నాటుసారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు 69 మంది నాటు సారా తయారీ, విక్రయదారులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఆలూరు ఎక్సైజ్ పరిధిలోని 5 మండలాల్లో నాటుసారా వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ నవీన్ కుమార్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉచిత క్యూలైన్ల మార్గంలో నాగుపాము

- భక్తులకు తప్పిన ప్రమాదం


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది: మహానంది దేవస్థానంలో సోమవారం భక్తులకు ప్రమాదం తప్పింది. ఉచిత దర్శనం ద్వారా వెళ్లే క్యూలైన్ల మార్గంలో నాగుపాము ప్రత్యక్షం కావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. ఆలయ సిబ్బంది స్నేక్ క్యాచర్ మోహన్‌కు విషయం చెప్పగా ఆయన ఆలయానికి చేరుకుని నాగుపామును పట్టుకుని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేశారు.

అనంతపురం – అమరావతి రహదారి అలైన్‌మెంట్ ఖరారు

- ఆమోదం తెలిపిన కేంద్రం
- అలైన్‌మెంట్‌లో మార్పులు కోరిన జెడ్పీచైర్మన్


అలైన్‌మెంట్‌పై అధికారులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అనంతపురం–అమరావతి 544–డీ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ దాదాపుగా ఖరారు అయ్యింది. అనంతపురం నుంచి బుగ్గ వరకు రెండు ప్యాకేజీల కింద చేపడుతున్న హైవే పనులు చివరి దశకు చేరుకున్నాయి. జిల్లా సరిహద్దు నుంచి గిద్దలూరు వరకు 135 కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణం కోసం జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల అలైన్‌మెంట్‌కు ఆమోదముద్ర వేసింది. జిల్లా సరిహద్దు నుంచి కొలిమిగుండ్ల మండలంలో మీదుగా ఈ హైవే సాగనుంది. అలైన్‌మెంట్‌లో చిన్న మార్పులు చేసేందుకు సోమవారం ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజినీర్ సుశాంత్, బెంగళూరుకు చెందిన కన్సల్టెన్సీ ప్రతినిధి భరత్‌తో పలు అంశాలపై క్షేత్ర స్థాయిలో చర్చించారు. జిల్లా సరిహద్దు నుంచి మండల కేంద్రం వరకు పలు చోట్ల అలైన్‌మెంట్ మార్పులు చేసే వాటిపై ఆయా ప్రాంతాలను చూపించి వివరించారు. మార్పులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారి చెప్పారు. 2017లో చేసిన అలైన్‌మెంట్ ప్రకారమే ఎలాంటి మార్పులు లేకుండా మండలంలో జాతీయ రహదారి నిర్మాణం జరుగనుంది. అతి త్వరలోనే డీపీఆర్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టెండర్లు పిలిచి ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈప్రాజెక్ట్ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

అలైన్‌మెంట్‌లో తప్పక మార్పులు చేపట్టాలి..

అనంతపురం–అమరావతి జాతీయ రహదారి నిర్మాణం జరిగితే రవాణ సదుపాయం మెరుగుపడుతుండటం సంతోషకరమని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలంలో అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. ఆమోదం చేసిన అలైన్‌మెంట్ ప్రకారం జిల్లా సరిహద్దు నుంచి కొలిమిగుండ్ల క్రాస్ రోడ్డు వరకు గ్రామాల్లోనే హైవే వస్తుంది. దీని వల్ల ఆయా గ్రామాల్లో నివాసాలు, ఇతర నిర్మాణాలు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అంకిరెడ్డిపల్లె, రాఘవరాజుపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల గ్రామాల్లో కాకుండా వెలుపల బైపాస్ నిర్మించాలని ఆయన కోరారు. ఈ విషయంపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అవసరమైతే రాష్ట్ర స్థాయి అధికారులను కోరుతామన్నారు. గ్రామాల్లో కాకుండా వెలుపల బైపాస్ చేపడితే నిర్వహణ వ్యయం తగ్గడంతో పాటు దూరం తగ్గుతుందన్నారు. ప్రధానంగా సిమెంట్, పవర్‌గ్రిడ్ తదితర పరిశ్రమలకు అనుకూలంగా మారుతుందన్నారు.